# మన(సు)లో మాట

పాఠక మహాశయులకు సంఘమిత్ర సంపాదక వర్గం సంక్రాంతి శుభాకాంక్షలు. అక్టోబరు సంచికలోని నవ్వితే నవ్వండి!, మన ఆచారాలు - అంతరార్థములు, నా స్మృతి పథంలో ఒక రోజు, ఆంధ్రవైభవము, జనపథం - జనపదం శీర్షికలు, ముఖచిత్రం, మీకు నచ్చినందుకు సంతోషం. సంఘమిత్రను మరింత ఆకర్షణీయముగా తీర్చిదిద్దాలనే మా ప్రయత్నమునకు మీ సలహాలు, సహాయము ఎంతో అవసరము.

(మకర) సంక్రాంతి పండుగను పల్లెలలో పండిన పంటలు ఇంటికి చేరే సందర్భములో జరుపుకుంటారని మనకి తెలుసు. కాని సంక్రాంతి సంబరాలు ఓ రెండు దశాబ్దాల క్రిందటికి, నేటికి ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. హరిదాసులు, గంగిరెద్దులు, చెక్క భజనలు చేసే బృందం, దాసరికాలు, భోగి మంటలు, బొమ్మల కొలువులు, హరికథలు, బుఱ్ఱకథలు, తోలు బొమ్మలాటలు, కోడి పందెములు, గొఱ్ఱె పందెములు, ముగ్గులు, పిండి వంటలు, అన్నదానములు, వస్త్రదానములు వంటివన్నీ దాదాపుగా కనుమరుగవుతున్నాయి. వాటి స్థానములో సినిమాలు ప్రదర్శించబడుతున్నాయి. మన సంస్కృతిని సంరక్షించుకోవడం మన ధర్మం. ఈ వాద్యములు, వివిధ ప్రక్రియలు మనని శారీరకముగా, మానసికముగా కూడా శక్తివంతులను చేయడానికి ఉపకరిస్తాయి. ఆముదముతో వెలిగించిన దీపముల వలన హానికరమైన క్రిమికీటకముల వలన రక్షణ లభిస్తుంది. చెక్కభజనలు లయ బద్ధముగా చెయ్యడము వలన, దానితో పాటు భగవంతుని కథలను శృతి బద్ధముగా పాడడం వలన ఉత్సాహము, ఆనందము కలుగుతుంది. డప్పును లయ బద్ధముగా వాయించడం వలన మన నరములు ఉత్తేజాన్ని పొందుతాయి. నేడు ఆ కళాకారులు జీవనోపాది లేక వారికి తెలిసిన కళలను ఉపయోగించడం లేదు. క్రొత్త తరానికి ఆ కళలను నేర్చుకునే ఆశక్తిగాని, సమయముగాని లేకపోవడం చేత మెల్లిగా ఆ కళలు తెరమరుగైపోతున్నాయి. మన బాధ్యతగా ఈ కళలను ఆదరిస్తే మన సంస్కృతిని పరిరక్షించుకున్నవారిమవుతాం!

మళ్ళీ ఉగాది సంచికలో కలుద్దాం! అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.